# ఈయనకి స్మశానందాకా డాక్టరుండాలి

కళ్యాణసింగ్ తెలుగుదేశంలో పుట్టినవాడైనా, "అకాలీ" టెంపర్ కలవాడు. చురుకు, చుఱ చుఱ గల బాలుడు. పదేళ్ళు వంద్రెం దేళ్ళుంటాయి. వానిముఖం యంతలో కందగడ్డ! ఇంతలో చందాయిగెడ్డ! ఎవరేమన్నా, ఏంచేసినా, అతి సెన్సిటివ్ ఫెలో ఏమో, నిరూపించి పోతాయి అనవాళ్లు! యతని కన్నీళ్ళల్లోనో, చిరునవ్వుల్లోనో.—అయితే ఇంటిలో తనవాండ్ల కెవరికి సేవ చేయవలసివచ్చినా, అవసరానికి హాజరు కావాలన్నా—రెడీ! వన్, టు, త్రీ, లాంటి లడ్కా! యక్కడకూడా ఉస్కోమంటే ఉస్కోమనంది వొక్క తండ్రితోనే. తండ్రంటే కళ్యాణసింగ్ నమ్రత, నాజూకుతనం కనబరుస్తాడు. తండ్రి చెప్పినపని మోజుతో చేస్తాడు.

కళ్యాణసింగుయొక్క తండ్రి వివృద్ధుడు. ఎన్ని వికారా లుండాలో యన్ని వికారాలున్నవాడు, అస్తమానం ఎదోమందు సేవిస్తూ, మాట్లాడితే, డాక్టరు మరకత్తయ్యంగార్ ఎమ్. బి. బి. ఎస్. కు కబురెడుతూ, కళ్యాణసింగును త్రిప్పుతూ వుండడం పరిపాటి.

ఎప్పటి బిల్లు యప్పుడే సూటిగా చెల్లించేవాడే రోగి; కాని రోగి చెల్లించినకొద్దీ, డబ్బు మరీ తొందరగా యందుకోవా లని, డాక్టరు మరకత్తయ్యంగార్కి మక్కువ ఎక్కువైపోయి, చివరకు ఆ ధనాసక్తి కక్కుర్తి యన్నంతకాడికి వచ్చేసింది. ఈ పద్ధతి పనికిరాదయ్యా అని నొక్కి వక్కాణించి ఆ డాక్టరు గారి ప్రకృతి మార్చగల ప్రజ్ఞ ఒక్కళ్ళవద్ద కానరాదయ్యే.

ఒకప్పుడు రోగి చేతిలో డబ్బు సిద్ధంగా వుంటుంది! ఒకప్పు డుండదు! రోగం చెప్పివస్తుందా? వస్తుంది యని పురిటికి, పుణ్యానికి మూట గట్టినట్టు ఏ గృహస్తు తన యింట్లో ధనాన్ని మురగబెడతాడు డాక్టర్లకు ఇచ్చేందుకు?—అందుకే మంచి మంచి డాక్టర్లు చికిత్స చేయడం అనేది సాంఘిక సేవగా పరిగణించాలన్నారు! అయితే కథలో ఆ బోధ వృధా! ఎవడు చదువుతాడు? ఎవరి క్కావాలి లోకకళ్యాణం? లోక సంగ్రహ సేవ? పరమార్ధ విచింతనమూను? కళ్యాణసింగువంటి కొందికకు అసహ్య మనిపించిన తరువాత ఆ డాక్టర్ ఎందుకు ఈ లోకంలో? చదవండి కథ! చివరకంటా! మీకే తెలుస్తుంది!

ఓ సారి ఏం జరిగింది? కళ్యాణసింగును అతని తండ్రి "వెంటనే వెళ్ళి డాక్టర్ గారిని తీసుకురావాలిరా! బ్రదికేటట్టు లేను!" అన్నాడు. కళ్యాణసింగు గుండెలు కవుక్కుంటూ పరు గెత్తుకెళ్ళి ముక్కకు ముక్క అక్కడ వొప్పజెప్పాడు. అప్పుడు ఇతర క్లయింట్లతో డాక్టర్ మరమకత్తయ్యంగార్ అందరూ వినేలా అన్నాట్ట. "ఈయనకు డాక్టర్ స్మశానందాకా కూడా వుండాలి! డిసీజ్‌డ్ హార్టురోగి! ఎన్నిసార్లు వెళ్ళిచూసేది?" అని-కుర్రవానితో "జరుగురేంటో వ్రాయించుకురా!" అన్నాట్ట.

ఈలా అన్నారు డాక్టరుగారు యని కళ్యాణసింగ్ తిరుగా వచ్చి తండ్రితో చెప్పి "కానఋయాంకా" లాగు కాలు కదప కుండా నిలబడ్డాడు.

తండ్రి వెంటనే చూడు! నాయనా! ఈయనకు మొన్నటి విజిట్టు బాపతు రెండు రూపాయలు మాత్రమే మనం ఇఖ ఇవ్వ వలసి వుంటుంది. ఆ రెండూ ఇచ్చివేసి ఋణవిముక్తుణ్ణి

అవుదామని కబురెట్టాను. రాకపోతె అట్టే వుంచుకుంటానా ఒకళ్ళ సొమ్ము? చూడు ఆ సొమ్ము ఎమ్. ఓ. కట్టిరా. ఆ ఫారమ్ ఇలా ఇవ్వు!" అని ఫారమ్ ఫిల్ అప్ చేస్తూ, ఒక రెండు రూపాయల ఏకండీ నోటు, 0-2-0 చిల్లఱ నికెల్ కాసు వానిచేత బెట్టి పోస్టుఆఫీసుకు పంపేడు.

కళ్యాణసింగు ఏమన్నా దాకిలో, మని ఆర్డరు ఫారమ్‌లో వ్రాసిన—తన తండ్రి వ్రాసిన—వ్రాతనంతనూ విడమర్చి చదువుకుంటూ డాక్టరుగారి చిరునామా చివర ఎమ్. బి. బి. ఎస్. అన్న అక్షరాలు, తపాలావారి సిరాకలంతో కొట్టివేసి, వాటికి ప్రత్యామ్నగా—"హార్టులెస్" అని వ్రాశాడు. తెనుగులో ఆ మాట కర్థము "గుండె మినహా."

డాక్టరు మరమక్క—త్తయ్యంగారు మర్నాడు మని ఆర్డరు అందుకుంటూ, తన చిరునామా చివర "హార్టులెస్" అన్న పదాలు చూచి, ఉగ్రుడై, వెంటనే ఓలాయర్ నోటీసు కల్యాణ సింగు తండ్రిపేర బణాయించాడు—దావాచేసే ముందు అందఱూ "ఎందుకయ్యా" దావా! ఆయనకు జబ్బుగుండె అయినా వుంది. నీకు అదీ లేదు యని నిజం బయలుపెడతారు కోర్టువారు." అని అన్నా మానక పరువునష్టముకుగాను పదివేల రూపాయల పరి హారం కోరుతూ దావా పడేశాడు.

దావాలో సాక్ష్య ప్రతిసాక్ష్యాలై, వాదోపవాదాలు వద్దకు వచ్చినప్పుడు "హార్టులెస్" అని ఎమ్. బి. బి. ఎస్. కొట్టివేసి వ్రాసింది ఎవరా యనే ప్రశ్న ఎంత కొట్టుకొన్నా తేలింది కాదు. "హార్టులెస్" ముసద్దీలకు పంపితే అది కల్యాణసింగు తండ్రిది కాదన్నారు ఇద్దఱూకూడా! కళ్యాణసింగుమీద యనుమానం

ఎవరికీ ఏ క్లేశమందూ పోలేదు. మఱి పోస్టుమాస్టర్ను, బంట్రో తుల్ని విచారించారు. అది తమ ఆఫీసు సిరా అవుగాక, ఎవరు వ్రాశారో తమకు ఎఱక లేదన్నారు. రిజల్టు! డాక్టరుగారు రోగి మీద తెచ్చిన దావా ఖర్చుల సమేతంగా కొట్టివేసినారు!

ఇంటికి వచ్చి కల్యాణసింగు తండ్రి, దావా నెగ్గిన విజయోత్సాహంలో నిజం స్ఫురించిందికాబోసు. "ఒరే సింగూ! నీవుగాని ఆనాడు ఎమ్. బి. బి. ఎస్. కొట్టివేసి "హార్టులెస్" యని వ్రాశావా ఏంట్రా?" యని అడిగాడు. కళ్యాణసింగు "మఱే! అడుగడుక్కీ ఆ డాక్టరు డబ్బు అడగడం చూస్తే, నాకు మా! అసహ్యం వేసింది సుమండీ! ఇంతడబ్బూ పుచ్చుకుంటూ పిల్చినప్పుడు రాకపోవడం! అసలు మొన్న అట్లతద్దికి ఆయన బోర్డుమీదున్న అక్షరాలు కూడా కొట్టివేసి. హెచ్. ఎల్. అని వ్రాసెయ్యాలనుకున్నాను. అయితే బోర్డు నాకు అందింది కాదు." అన్నాడు. "మఱి పోడుగెదిగాక చేసేవు గనుక! అలాంటి పనులెప్పుడూ చేయకు!" అని తండ్రి మందలించాడు. కాని కొడుకు "అది యంత పెద్దమాట అయితే దానిమీద పోస్టల్‌వాళ్ళు ఓ ముద్రకొట్టేయలేక పోయినారూ?" అంటూ కొడుకు కళ్యాణసింగు పంచకల్యాణి గుఱ్ఱంలా పంచబంగాళమయ్యాడు!

.... .... .... .... ....

## పూ జా పు ష్పా లు

పూర్వం రిక్షాను అనంతశయనంతో పోల్చేవారు. అక్టేమంది ఎక్కేవారుకారు. అందులోను హిందువులు యసలే ఎక్కేవారు